సమస్యల పరిష్కారానికి కృషిచేస్తా



నాయకులతో కలిసి నాలాను పరిశీలిస్తున్న వెన్నెల

రసూల్‌పురా: కంటోన్మెంట్ నియోజకవర్గంలో దీర్ఘకాలంగా ఉన్న సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టనున్నట్లు కాంగ్రెస్ పార్టీ కంటోన్మెంట్ నియోజక వర్గ ఇన్‌చార్జి డాక్టర్ వెన్నెల పేర్కొన్నారు. గురువారం మూడో వార్డు అన్నానగర్, బాలంరాయి బస్తీల్లో ఆమె పార్టీ నాయకులతో కలిసి పర్యటిస్తూ పీఅండ్‌టీ కాలనీ నాలాను పరిశీలించారు. 20 ఏళ్లుగా పీఅండ్‌టీ కాలనీ, రెండవ వార్డు లక్ష్మిగుంటి కాలనీ మధ్య కల్వర్టు నిర్మాణానికి నిధులు విడుదలైనా పనులు జరగకపోవడంతో ఐదు కిలోమీటర్లు చుట్టూ తిరిగి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందని స్థానికులు వెన్నెలకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వెన్నెల మాట్లాడుతూ.. హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి చొరవ చూపుతానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు మర్రి అమరేందర్ రెడ్డి, నాగేష్, రాజేష్‌యాదవ్, మహేష్, అన్నానగర్ మురళి, ముప్పిడి గోపాల్, రవి పాల్గొన్నారు.

తార్నాక ఆలయాల్లో 'స్వచ్ఛ అభియాన్'



ఆలయ పరిసరాలు శుభ్రం చేస్తున్న దృశ్యం

లాలాపేట: అయోధ్య రామ మందిర ప్రాణప్రతిష్ట నేపథ్యంలో ప్రధాని మోదీ పిలుపు మేరకు తార్నాక మున్సిపల్ డివిజన్‌లో గురువారం ఆలయాల్లో స్వచ్ఛ అభియాన్ కార్యక్రమాన్ని చేపట్టారు.తార్నాక చౌరస్తాలోని గణపతి దేవాలయంలో మాజీ ఎమ్మెల్సీ ఎన్. రామ్‌చందర్ రావు, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి తదితరులు మందిర పరిసరాలను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రామమందిర ప్రారంభోత్సవం సందర్భంగా స్థానికంగా ఉండే అన్ని దేవాలయాల్లో స్వచ్ఛ అభియాన్ చేపట్టాలని పిలుపునిచ్చారు. ఈ నెల 22న జరిగే ఆలయ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని లైవ్ ద్వారా ప్రజలందరూ వీక్షించాలని సూచించారు. ఇళ్లు, ఆలయాలను అలంకరించి దీపాలు వెలిగించాలన్నారు. తార్నాక డివిజన్ బీజేపీ అధ్యక్షులు రాము వర్మ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వెంకటేష్‌గౌడ్, వేణుయాదవ్, శ్రీనివాసచారి, నాగేశ్వర్‌రావు, రవిప్రసాద్, ప్రమోద్, కృష్ణమూర్తి, కృష్ణాగౌడ్ తదితరులున్నారు.

తార్నాక డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా బ్రహ్మాజీ



నియామక పత్రం అందుకుంటున్న బ్రహ్మాజీ

లాలాపేట: సికింద్రాబాద్ నియోజకవర్గం తార్నాక డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా ఎస్. బ్రహ్మాజీ నియమితులయ్యారు. గురువారం జిల్లా అధ్యక్షులు ఎం. అనీల్ కుమార్ చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా బ్రహ్మాజీ మాట్లాడుతూ.. తనకు ఈ పదవి రావడానికి సహకరించిన ఆదం సంతోష్‌కుమార్, పీసీసీ కార్యదర్శి అమర్‌నాథ్‌గౌడ్, పార్టీ అధినాయకులకు కృతజ్ఞతలు అన్నారు. డివిజన్‌లోని నాయకులు, కార్యకర్తలందరినీ సమన్వయం చేస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు.

అవయవదానం



అన్నారపు శంకర్ (ఫైల్)

బన్సీలాల్‌పేట: కుటుంబ పెద్ద మరణించి పుట్టెడు దుఃఖంలో ఉన్నప్పటికీ వారి కుటుంబ సభ్యులు తీసుకున్న నిర్ణయం ఎందరికో స్ఫూర్తిదాయకం. బీకేగూడ ప్రాంతానికి చెందిన అన్నారపు శంకర్ (61) అనారోగ్య కారణాలతో స్పృహ కోల్పోగా అతన్ని వెంటనే చికిత్స కోసం స్థానిక ఆస్పత్రికి తరలించి మెరుగైన చికిత్స కోసం సికింద్రాబాద్‌లోని కిమ్స్ ఆస్పత్రికి తరలించారు. రోగిని పరిశీలించిన వైద్యులు బ్లడ్ క్లాట్ అయ్యిందని గుర్తించారు. అతడిని రక్షించడానికి రెండు రోజులుగా శ్రమించినా ఫలితం లేకుండా పోయింది. గురువారం ఉదయం బ్రెయిన్ డెడ్ అయ్యింది. అవయవదాన సమన్వయకర్తల సలహా మేరకు భార్య, పిల్లల అంగీకారంతో లివర్, రెండు కిడ్నీలు దానం చేశారు. చనిపోతూ కూడా తమ తండ్రి మరో ముగ్గురికి ప్రాణదానం చేయడం ఎంతో గర్వంగా ఉందని మృతుడి పిల్లలు తెలిపారు. జీవన్‌ధాన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గ్రీన్ చానెల్ ద్వారా అవయవాలను తరలించారని కమిటీ సభ్యులు తెలిపారు.

క్రీడలకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం

అంబర్‌పేట్: రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు ప్రత్యేక ప్రాధాన్యత కల్పిస్తున్నదని రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. గురువారం సీఎఫ్ఐ చైర్మన్, మాజీ ఎంపీ వి.హనుమంతరావు ఆధ్వర్యంలో 23వ రాజీవ్‌గాంధీ ఆల్ ఇండియా అండర్-19 టీ-20 క్రికెట్ చాంపియన్ షిప్ టోర్నీకి అంబర్‌పేట్‌లోని జలమండలి క్రికెట్ గ్రౌండ్‌లో చేపట్టారు. ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి పొన్నం టోర్నీని ప్రారంభించిన అనంతరం మాట్లాడుతూ... క్రీడాకారులకు తమ ప్రతిభను చాటుకునేందుకు ఇలాంటి టోర్నీలు ఎంతో దోహదపడుతుయన్నారు. హెచ్ మాట్లాడుతూ... యువత చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. ఈ టోర్నీలో శ్రీలంక, మలేషియాతో పాటు దేశంలోని వివిధ రాష్ట్రలకు చెందిన క్రికెట్ జట్లు పాల్గొన్నాయి. కార్యక్రమంలో ఆర్గనైజింగ్ సెక్రటరీ శంభుల శ్రీకాంత్‌గౌడ్, ప్రతినిధులు సయ్యాద్ సాదిక్ భాషా, అమర్‌జిత్ కుమార్, అది అవినాష్, రజినీకాంత్, కాంగ్రెస్ నాయకులు ఆర్.లక్ష్మణ్‌యాదవ్, బొల్లు కిషన్, జ్ఞానేశ్వర్‌గౌడ్, దిడ్డి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

రేపు 'అమెరికా అడ్మిషన్స్ డే'

పంజగుట్ట: అమెరికాలో ఉన్నత విద్యను అభ్యసించాలనుకునే వారు ఎలా వెళ్లాలి, ఏ యూనివర్సిటీని ఎంచుకోవాలి, స్కాలర్‌షిప్ ఎలా పొందాలి అనే విషయాలపై అవగాహన కల్పించనున్నట్లు యూని ఎక్స్ ఓవర్సీస్ ఎడ్యుకేషన్ ఆపరేషన్స్ హెడ్ ఉమ తెలిపారు. అందులోభాగంగా ఈ నెల 20వ తేదీన సోమాజిగూడలోని తమ సంస్థలో ఉచితంగా యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా అడ్మిషన్స్ డేను నిర్వహించనున్నట్లు ఆమె తెలిపారు. గురువారం కార్యక్రమ కరపత్రాన్ని సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆమె ఆవిష్కరించారు. ఈ ఫెయిర్‌లో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు వీసా రిక్రూట్‌మెంట్, అడ్మిషన్స్ రిక్రూట్‌మెంట్, స్కాలర్‌షిప్ ఆప్షన్స్, లాంగర్ స్టే బ్యాక్ ఆప్షన్స్, ట్రావెల్ అప్‌డేట్స్ తదితర అంశాలను నేరుగా తెలుసుకోవచ్చని తెలిపారు. అమెరికాకు చెందిన అన్ని ప్రముఖ యూనివర్సిటీల ప్రతినిధులు కార్యక్రమానికి హాజరవుతారని ఆమె పేర్కొన్నారు. వివరాలకు ఫోన్: 99123 28645లో సంప్రదించాలని కోరారు.

సీసీ రోడ్డంటూ తవ్వారు.. అర్ధంతరంగా వదిలేశారు!

- ఆర్యనగర్‌లో ఆగిపోయిన పనులు
- రాకపోకలకు ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు

లాలాపేట: తార్నాక డివిజన్ పరిధిలో చేపట్టిన పలు అభివృద్ధి పనులను పూర్తిగా నత్తనడకన సాగుతున్నాయి. అర్ధంతరంగా వదిలేసిన పనులతో ఆయా ప్రాంతాల వారు నానా ఇక్కట్లకు గురవుతున్నారు. అభివృద్ధి పనులు కొనసాగుతున్న సమయంలో స్థానికులకు ఎలాంటి ఇబ్బందులు రావొద్దని సూచిస్తున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు అర్ధంతరంగా ఆగిపోతున్న పనులపై ఎందుకు స్పందించడం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

కాంట్రాక్టర్‌లకే వత్తాసు..

ప్రజాధనంతో చేపడుతున్న పలు అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయించడంలో అధికారులు తీవ్రంగా విఫలమవుతున్నారనే స్పష్టంగా కనిపిస్తోంది. పనులు దక్కించుకున్న గుత్తేదారు, అధికారులు అసలే రారు అన్న చందంగా తయారైంది. దాదాపు ఏడాది గడుస్తున్నా ఇంకా పనులు కొనసాగుతున్న వైనం తార్నాక మున్సిపల్ డివిజన్‌లో చోటు చేసుకుంది. కాంట్రాక్టర్‌లను అధికారులు కట్టడి చేయలేకపోతున్నారంటే ప్రజా ప్రతినిధులు సైతం వారికే అండగా నిలుస్తున్నారే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మంచిగా ఉన్న రోడ్లను తవ్వి సీసీ రోడ్లుగా మారుస్తామని అర్ధంతరంగా వదిలేయడంతో రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని వాపోతున్నారు.

రాత్రి సమయంలో ప్రమాదాలు..

ఆర్యనగర్‌లో సీసీ రోడ్ల నిర్మాణానికి మోక్షం ఎప్పుడు కలుగుతుందో అనిన ప్రజలు ఎదురు



చూస్తున్నారు. గతేడాది ఏప్రిల్ మొదటి వారంలో బస్తీలోని రోడ్లనీ సీసీ రోడ్ల నిర్మాణం కోసం తవ్వారు. నాటి నుంచి నేటి వరకు ఎలాంటి పనులు చేపట్టలేదు. తవ్వి వదిలేసిన రోడ్ల గుండా స్థానికులు రాకపోకలు సాగించలేకపోతున్నారు. పైకి తేలిన మ్యాన్‌హోళ్లతో రాత్రి సమయంలో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. దాదాపు 10 నెలల కాలం గడుస్తున్నా నేటికి ఇటువైపు సంబంధిత అధికారులు సదరు కాంట్రాక్టర్



ఆర్యనగర్‌లో తవ్వి వదిలేసిన రోడ్లు

గానీ కన్నెత్తి చూడకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రోడ్లను ఇష్టానుసారంగా తవ్వడంతో పలు ప్రాంతాల్లో డ్రైనేజీ పైపులు కూడా ధ్వంసమై తరచూ మురుగు పారుతుండటంతో దుర్వాసన వస్తోందని వాపోతున్నారు.

ఎమ్మెల్యే ఆదేశించినా..

పెండింగ్‌లో ఉన్న సీసీ రోడ్ల నిర్మాణ విషయంలో గతంలో సాక్షిలో ప్రచురితమైన కథనానికి స్పందించిన ఎమ్మెల్యే పద్మారావు గౌడ్ సంబంధిత అధికారులను పిలిపించి మాట్లాడారు. ఏ ఏ ప్రాంతాల్లో తవ్విన రోడ్లను వెంటనే సీసీ రోడ్లుగా మార్చి రాకపోకలకు అంతరాయం లేకుండా చేయాలని ఆదేశించారు. ఎమ్మెల్యే వేగంగా స్పందించిన అధికారులు ఆ తర్వాత వాటి గురించే మర్చిపోయారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి తవ్విన రోడ్లను సీసీ రోడ్లుగా మార్చాలని కోరుతున్నారు.

కాలనీల అభివృద్ధికి సహకరిస్తా: ఎమ్మెల్యే



కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

సనత్‌నగర్: కాలనీల అభివృద్ధికి సహకరిస్తూ ప్రజా సమస్యలను తన దృష్టికి రాగానే వాటి పరిష్కారం కోసం కృషి చేస్తానని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ హామీ ఇచ్చారు. వెస్ట్‌మారేడ్‌పల్లిలోని తన నివాసం వద్ద ఎస్ఆర్‌నగర్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర కేలండర్‌ను గురువారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాలనీలోని ప్రజల సమస్యలను పరిష్కరిస్తూ అభివృద్ధికి కృషి చేయాలని ఎస్ఆర్‌నగర్ అసోసియేషన్ ప్రతినిధులకు సూచించారు.ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, జనరల్ సెక్రటరీ నరేందర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు డేవిడ్, వివేకానంద్, రోజారెడ్డి, అమీర్‌పేట డివిజన్ బీఆర్ఎస్ జనరల్ సెక్రటరీ సంతోష్ మణికుమార్ పాల్గొన్నారు.

6 నెలల్లో ఆలయ నిర్మాణం పూర్తి



స్థపతి వలినాయగంతో సమావేశమైన కమిటీ సభ్యులు

చిలకలగూడ : శ్రీనివాసనగర్ శ్రీగిరి ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణ పనులు 6 నెలల్లో పూర్తిచేసి అందుబాటులోకి తెచ్చేందుకు కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేశారు. సంబంధిత ఇంజినీరింగ్ అధికారులు, పునర్నిర్మాణ కమిటీ ప్రతినిధులతో ఆలయ స్థపతి వలినాయగం గురువారం ఆలయ ప్రాంగణంలో సమావేశమై పలు అంశాలపై చర్చించారు. పునర్నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయని, ఆలయ గోపురాలను రాతిశిలతో నిర్మించేందుకు నిర్ణయించినట్లు ఈఓ రాజేష్‌కుమార్ తెలిపారు. కంచి, మహాబలిపురం నుంచి ప్రత్యేకంగా తెప్పించిన కృష్ణశిలలతో నిర్మాణాలు చేపట్టామన్నారు. ఈ ఏడాది జూన్ నాటికి పనులు పూర్తి చేసేందుకు కార్యాచరణ రూపొందించి అమలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు బాల భాస్కర్, ఆత్మరామసూర్యసుబ్రహ్మణ్యం, నారాయణన్, సుజయ్ ప్రకాశ్, ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.



శుభాకాంక్షలు

తెలంగాణ రాష్ట్ర శాసన మండలి సభ్యుడు (ఎమ్మెల్సీ)గా నామినేషన్ వేసిన టీపీసీసీ రాష్ట వర్కింగ్ ప్రెసిడెంట్ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్‌ను గురువారం కాంగ్రెస్ సీనియర్ నాయకుడు బేగంపేట రమేష్ కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

–సాక్షి, సిటీబ్యూరో

బస్సు డ్రైవర్ల చేంజ్‌ఓవర్

సికింద్రాబాద్‌లోని రెండు ప్రధాన రహదారుల్లో ఆర్టీసీ బస్సులును అడ్డదిడ్డంగా నిలుపుతున్నారు. చేంజ్ ఓవర్ పేరిట సిటీ బస్సులను ఇష్టానుసారంగా పార్కింగ్ చేస్తుండడంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. నిత్యం డ్రైవర్లు, కండక్టర్లు డ్యూటీలు మారే సమయంలో రోడ్డు మొత్తం ఆక్రమిస్తూ బస్సులు నిలుపుతుండటంతో ఇతర వాహనాల రాకపోకలకు అంతరాయం కలుగుతుంది. వివిధ డిపోలకు చెందిన బస్సుల్లో డ్యూటీలు మారడం కోసం సికింద్రాబాద్ రైల్‌నిలయం నుంచి సంగీత్ కూడలి మార్గంలో చేంజ్ ఓవర్ పాయింట్‌ను ఏర్పాటు చేశారు. ఇక్కడ పలు డిపోల బస్సులను రోడ్డును మొత్తంగా ఆక్రమిస్తూ పార్కింగ్ చేస్తున్నారు. రోడ్డుపై అడ్డదిడ్డంగా నిలిపిన బస్సులు కొత్తగా డ్యూటీలో చేరిన డ్రైవర్లు వచ్చే వరకు అలాగే ఉంటున్నాయి. మరోవైపు ఒలిఫెంటా వంతెన సమీపంలోనూ అదే పరిస్థితి నెలకొంది. చిలకలగూడ–సికింద్రాబాద్ రహదారిలోనూ అడ్డదిడ్డంగా బస్సులు నిలుపుతున్న డ్రైవర్లు ట్రాఫిక్ సమస్యలు సృష్టిస్తున్నారు. ఆర్టీసీ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుని బస్సులు క్రమ పద్ధతిలో ఆపేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. –సికింద్రాబాద్



భవిష్యత్‌లో డిజిటల్ విద్యకు ప్రాధాన్యం

ఉస్మానియా యూనివర్సిటీ: భవిష్యత్‌లో డిజిటల్ విద్యకు అధిక ప్రాధాన్యం లభిస్తుందని ఉన్నత విద్య ముఖ్య కార్యదర్శి బుర్ర వెంకటేశం అన్నారు. గురువారం ఓయూ క్యాంపస్ దూర విద్య కేంద్రంలో ఈఎంఎంఆర్‌సీ, సీఈసీ సంయుక్త ఆధ్వర్యంలో డిజిటల్ విద్య, మాసివ్ ఓపెన్ ఆన్ లైన్ కోర్సులు మూక్స్ అనే అంశం పై రెండు రోజుల జాతీయ వర్క్ షాప్ ప్రారంభమైంది. కార్యక్రమానికి సీఈసీ న్యూ ఢిల్లీ డైరెక్టర్ ప్రొ. జగత్ భూషన్ నడ్డా అధ్యక్షత వహించగా బుర్ర వెంకటేశం ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతి వెలిగించి వర్క్‌షాప్‌ను ప్రారంభించి మాట్లాడారు. రానున్న రోజుల్లో మూక్ విద్యా బోధన కీలక పాత్ర వహించనున్నట్లు ఈ సందర్భంగా పలువురు వక్తలు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మీనారాయణ, డైరెక్టర్ రఘుపతి, డీన్ ప్రొ.మల్లేశం, ప్రొ.రాములు పాల్గొన్నారు.

రైలు బోగీలో వ్యక్తి మృతి



ఉత్తమ్ లోహర్ మృతదేహం

సికింద్రాబాద్: రైలు బోగీలో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన సికింద్రాబాద్ రైల్వే పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌కు చేరుకున్న ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్ రైలు జనరల్ బోగీలో ఒక ప్రయాణికుడు అపస్మారక స్థితిలో పడి ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందింది. సదరు వ్యక్తి అనారోగ్యంతో మృతి చెందినట్లు గుర్తించారు. మృతుడి వద్ద లభించిన ఆధారాలతో పశ్చిమ బెంగాల్‌కు చెందిన ఉత్తమ్ లోహర్ (45)గా గుర్తించి మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు.

మహిళల మదిదోచే వస్త్ర ప్రదర్శన

శ్రీనగర్‌కాలనీ: శ్రీనగర్‌కాలనీలోని సత్యసాయి నిగమాగమంలో క్రాఫ్ట్స్ అండ్ వీవర్స్ ఆర్టిసన్స్ వెల్ఫేర్ అసోషియేషన్ ఆధ్వర్యంలో హ్యాండ్ టు హ్యాండ్ సిల్క్ ఎక్స్‌పో-2024 పేరిట ఏర్పాటు చేసిన వస్త్ర ప్రదర్శనను గురువారం గాయని గాయత్రి వేదాంతం ప్రారంభించారు. ఈ సందర్భంగా గాయత్రి మాట్లాడుతూ... నగర ఫ్యాషన్ ప్రియులను ముఖ్యంగా మహిళలను ఈ ఎక్స్‌పో ఎంతగానో ఆకట్టుకుంటుందన్నారు. ప్రదర్శనలో తెలంగాణ సంప్రదాయ వస్త్రాలతో పాటు పలు రాష్ట్రాల చేనేతకారుల ఉత్పత్తులైన సిల్క్, కాటన్, డిజైనరీ చీరలతోపాటు పలు ఫ్యాన్సీ వస్తువులను సుమారు 60 స్టాల్స్‌లో ప్రదర్శిస్తున్నారు. చేనేత కళాకారుల ఉత్పత్తులు నేరుగా వినియోగదారులకు చేరాలనే సదుద్దేశంతో ఈ ప్రదర్శనను ఏర్పాటు చేశామని నిర్వాహకుడు జయేష్‌గుప్తా తెలిపారు. వస్త్ర ప్రదర్శన ఈ నెల 24 వరకు అందుబాటులో ఉంటుందని వివరించారు.

నేడు, రేపు కులగణనపై జాతీయ సెమినార్

కాచిగూడ: ఆల్ ఇండియా ఓబీసీ స్టూడెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 19, 20 తేదీల్లో కులగణన, సామాజిక న్యాయం అనే అంశంపై యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్‌లో నేషనల్ సెమినార్ నిర్వహించనున్నట్లు అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు జి.కిరణ్ కుమార్, జాతీయ కార్యదర్శి ఎస్.సాయి కిరణ్ తెలిపారు. విద్యావేత్తలు, మేధావులు, రాజకీయ ప్రముఖులు, సామాజిక కార్యకర్తలు పాల్గొని కులగణనపై చర్చిస్తారన్నారు. వర్చువల్ మోడ్‌లో కూడా జరుగనున్న ఈ సెమినార్‌లో ప్రముఖ విధాన రూపకర్త సామ్‌పిట్రోడా, ద్రావిడ కళగం కార్యదర్శి కె.వీరమణి, డీఎంకే రాజ్యసభ సభ్యుడు పి.విల్సన్, స్వరాజ అభియాన్ అధ్యక్షుడు యోగేంద్ర యాదవ్, ప్రొఫెసర్ ఇ.వెంకటేశం, ఆళ్ల రామకృష్ణ తదితరులు పాల్గొని ప్రసంగిస్తారని తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

సనత్‌నగర్: హెచ్‌పీఎస్, ఎయిర్‌పోర్ట్ సబ్‌స్టేషన్ల పరిధిలోని విద్యుత్ ఫీడర్ లైన్ల మరమ్మతుల కారణంగా సరఫరాలో అంతరాయం ఉంటుందని గ్రీన్ ల్యాండ్స్ ఏడీఈ చరణ్‌సింగ్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు బేగంపేట శ్యాంలాల్ బిల్డింగ్స్ తాతాచారికాలనీ, బొంబే హల్వా కాంపౌండ్, పోచమ్మబస్తీ, ఆర్‌బీఐ క్వార్టర్స్, వాణి ప్రింటర్స్ ఏరియా. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఇండియన్ ఎయిర్‌లైన్ కాలనీ, ప్రకాష్‌నగర్ ప్రాంతాల్లో విద్యుత్ కోత ఉంటుందన్నారు.

కంటోన్మెంట్ పరిధిలో..

కంటోన్మెంట్: ఫీడర్ల మరమ్మతులు, చెట్ల కొమ్మల నరికివేత కారణాలతో సరఫరాలో అంతరాయం ఉంటుందని కంటోన్మెంట్ బోర్డు ఏడీఈ ఓ ప్రకటనలో తెలిపారు.ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 వరదకు అల్వాల్ ఫీడర్ పరిధిలోని భూపతిరావునగర్, జింఖానా పరిధిలోని సిఖ్‌విలేజ్ ప్రాంతాలు. మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 4.30 చంద్రపురం కాలనీ, మడ్‌ఫోర్ట్ ప్రాంతాల్లో సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా రూ.19, నల్లవంకాయ 23, పొడుగు వంకాయ 23, బెండకాయ 35, పచ్చిమిర్చి 50, బజ్జీమిర్చి 50, క్యాప్సికమ్ 55, పచ్చకాకర 55, పందిరి బీర 40, క్యాబేజీ 19, క్యారెట్ 40, దొండ 23, గుండుబీన్స్ 45, గింజచిక్కుడు 40, గోకరకాయ 45, కీర 15, దోసకాయ 28, బీట్‌రూట్ 19, ఉల్లిగడ్డ 20, ఆలుగడ్డ 18, చామగడ్డ 50, మొరంగడ్డ 28, కందగడ్డ 50, సొరకాయ 9, పొట్లకాయ 18, అరటికాయ 9, మునగకాయ 4-6, ముల్లంగి 4-6. ఈ ధరలు శుక్రవారం ఉదయం 9 గంటల వరకు అమలులో ఉంటాయి.

నేరుగా లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు అందించాలి



మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

సికింద్రాబాద్: ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన హామీలన్నీ అమలు చేయాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. ముఖ్యంగా అభయహస్తం పథకాన్ని అర్హులైన లబ్ధిదారులు అందరికీ వర్తింపజేయాలని కోరారు. గురువారం అడ్డగుట్టలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో సికింద్రాబాద్ కార్యదర్శి కాంపల్లి శ్రీనివాస్ మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వ పదేళ్ల పాలనలో అసలైన లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలు అందలేదన్నారు. గతంలో లబ్ధిదారులకు ప్రభుత్వ ఫలాలను అందించడంలో దలారులను ఆశ్రయించక తప్పని పరిస్థితి నెలకొందన్నారు. పార్టీ నాయకులు, పైరవీకారులు మాత్రమే గత ప్రభుత్వం హయాంలో లబ్ధిపొందారని కాంగ్రెస్ హయాంలో అలాంటి పరిస్థితులకు తావు లేకుండా అధికారులు, పాలకులు చర్యలు తీసుకోవాలన్నారు. యాదగిరి, రషీద్, ఖాసీం పాల్గొన్నారు.

గంజాయి రవాణా చేస్తున్న మహిళ రిమాండ్

46 కిలోలు స్వాధీనం



గంజాయితో పట్టుబడ్డ మహిళను చూపుతున్న పోలీసులు

సికింద్రాబాద్: ఒడిశా నుంచి మహారాష్ట్రకు గంజాయిని సరఫరా చేస్తున్న మహిళను సికింద్రాబాద్ రైల్వే పోలీసులు రిమాండ్‌కు తరలించారు. రైల్వే ఎస్పీ సలీమా, డీఎస్పీ ఎ.నర్సయ్య వివరాల ప్రకారం.. 6వ నెంబర్ ప్లాట్‌ఫామ్‌పై పోలీసులు సాధారణ తనిఖీలు చేస్తుండగా అనుమానాస్పదంగా ఒక మహిళ కనిపించింది. ఆమెను అదుపులోకి తీసుకున్న పోలీసులు లగేజీ బ్యాగులను తనిఖీ చేయగా 46 కిలోల గంజాయి ప్యాకెట్లు లభ్యమయ్యాయి. ఒడిశా రాష్ట్రం గజపతి జిల్లా మోహన గ్రామానికి చెందిన శిల్పానాయక్ (27) నిందితురాలిని అదుపులోకి తీసుకుని విచారించగా తాను వితంతువు కావడంతో కుటుంబ ఖర్చుల కోసం గంజాయి రవాణాకు ఒప్పుకున్నానని తెలిపింది. తమ ప్రాంతానికి చెందిన రాజీవ్‌కుమార్ కుమార్ అనే వ్యక్తి తనకు ఈ వ్యాపారం గురించి వివరించి రవాణాకు ఒప్పించాడని తెలిపింది. ఫలక్‌నుమా రైలులో పలాస నుంచి సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌కు జనరల్ బోగీలో గంజాయి ప్యాకెట్లను వెంట తీసుకుని రాజీవ్‌కుమార్‌తో పాటే సికింద్రాబాద్ వరకు వచ్చానన్నారు. ఇక్కడి నుంచి ముంబైకి వెళ్లేందుకు 6వ నెంబర్ ప్లాట్ ఫామ్ వద్ద ఎదురుచూస్తున్న సమయంలో తను పోలీసులకు చిక్కినట్టు పేర్కొంది. తనను ప్లాట్‌ఫామ్‌పై ఉంచిన రాజీవ్‌కుమార్ భోజనం చేసి, తనకు పార్సల్ తెస్తానని చెప్పి బయటకు వెళ్లినట్టు తెలిపింది. నిందితురాలిని రిమాండ్‌కు తరలించి ప్రధాన నిందితుడు రాజీవ్‌కుమార్ కోసం గాలిస్తున్నారు. పెద్దమొత్తంలో గంజాయి స్వాధీనం చేసుకున్న పోలీసులకు రైల్వే ఎస్పీ రివార్డులు ప్రకటించారు.

సాగు చేస్తున్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ..



గంజాయి మొక్కలు స్వాధీనం చేసుకున్న పోలీసులు

బౌద్ధనగర్: గంజాయికి అలవాటు పడిన ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి సొంతంగా గంజాయి సాగు చేస్తూ పోలీసులకు పట్టుబడిన ఘటనా వారాసిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ పి.శంకర్ కథనం ప్రకారం.. వెస్ట్ పార్శిగుట్టకు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి అయిన రాహుల్ రాజ్(29) గంజాయికి అలవాటు పడ్డాడు. నగరంలో గంజాయిపై ప్రత్యేక నిఘా ఉంచిన పోలీసులకు చిక్కరాదనే తానే గంజాయి మొక్కలను పెంచాలని నిర్ణయించాడు. కొందరి వద్ద గంజాయి విత్తనాలు సేకరించి ఇంటివద్దనే పెంచడం మొదలు పెట్టాడు. సమాచారం అందుకున్న పోలీసులు గురువారం ఇన్‌స్పెక్టర్ శంకర్ ఆధ్వర్యంలో ఎస్ఐసుధాకర్, హెడ్ కానిస్టేబుల్ రవికుమార్, పీసీ ఎండీ గాలెబ్, దేవేందర్ నాయక్‌నిందితుడి ఇంటిపై దాడి చేసి మూడు గంజాయి మొక్కలు, విత్తనాలు స్వాధీనం చేసుకుని రాహుల్ రాజ్ రిమాండ్‌కు చేశారు.



సికింద్రాబాద్ మహీంద్రా షోరూంలో కంపెనీ రూపొందించిన కొత్త వాహనాన్ని మార్కెట్‌లోకి విడుదల చేశారు. గురువారం మహీంద్రా ఎక్స్‌యూవీ-400 వాహనాన్ని సికింద్రాబాద్ ఎమ్మెల్యే టీ.పద్మారావుగౌడ్ విడుదల చేశారు. –సికింద్రాబాద్